క్లుప్తంగా

పంట నష్టంపై వినతి



బిజినేపల్లి: అధిక వర్షాలకు పత్తి, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని మండలంలోని వట్టెం గ్రామానికి చెందిన రైతులు మంగళవారం ఏఓ కమల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పత్తి మొక్కజొన్న పంటలో అధిక వర్షాల కారణంగా పూత రాలిపోయి, దిగుబడి కూడా రాలేదని వివరించారు. రైతులు శంకర్, భాస్కర్, తిరుపతయ్య, గోవర్ధన్, పర్వతాలు, విష్ణు, శివకుమార్, తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

బల్మూర్: మండలంలోని కొండనాగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001–02 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన సంతోష్ కుమారుడు మనోజ్‌కుమార్ కిడ్నీ వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న సంతోష్ స్నేహితులు డబ్బులను పోగు చేసుకొని వైద్య ఖర్చుల నిమిత్తం రూ.25 వేలను మంగళవారం బాధిత కుటుంబానికి అందజేశారు.

వెల్దండ: మండలంలోని లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొమ్ము యాకోబు అనారోగ్యంతో మృతి చెందాడు. మంగళవారం బాధిత కుటుంబానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ సమకూర్చిన రూ.5వేలు సోమయ్య ఆధ్వర్యంలో అందజేశారు.

బియ్యం వితరణ

చారకొండ: మండలంలోని జూపల్లిలో వారం రోజుల కిందట గ్రామానికి చెందిన అంకిల్ల పరశురాములు అనారోగ్యంతో మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని మంగళవారం సత్యహరిశ్చంద్ర ఫౌండేషన్ చైర్మన్ నకినమోని రాములు యాదవ్ పరామర్శించి 50 కేజీల బియ్యం వితరణ చేశారు. వారి వెంట గ్రామస్తులు, సిరాజ్ తదితరులు ఉన్నారు.

బీఫాం ఇవ్వాలని వినతి

ఊర్కొండ: హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్‌ను మంగళవారం నాగర్‌కర్నూలు జిల్లా ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు వాగులు దాస్ నిరంజన్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఊర్కొండ జెడ్పీటీసీ స్థానం బీసీలకు కేటాయించారని దీంతో తనకు పోటీ చేసేందుకు పార్టీ నుంచి బీఫాం ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు. మండలంలో పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్నానని వివరించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు కరణ్ జీ, బోల్గం దివాకర్ గౌడ్, అరవింద్ గౌడ్, తాడేం చిన్న, శివకుమార్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

వెల్దండ: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణంలో మంగళవారం సైబర్ నేరాలపై ప్రజలకు పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త వ్యక్తులకు బ్యాంక్ వివరాలు, ఫోన్‌నంబర్, ఆధార్‌కార్డుల వివరాలను చెప్పొద్దని సూచించారు. సైబర్ నేరగాళ్లు ఓటీపీ చెబితే బ్యాంక్ ఖాతాలో ఉన్న డబ్బులు కాజేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది శ్రీనివాసులు, రమణ, రవి, శివ, కౌసల్య, సందీప్, పర్వతాలు, నవీన్‌యాదవ్ ఉన్నారు.

ఎంఈఓ ఆకస్మిక తనిఖీ

ఉప్పునుంతల: మండలంలోని కొత్తరాంగనర్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎంఈఓ చంద్రశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి వారిగా విద్యార్థుల విద్యా ప్రగతిని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యను అందించాలన్నారు. విద్యార్థుల సంఖ్యను, హాజరు శాతాన్ని పెంచాలని ఉపాధ్యాయురాలు బాలమణికి సూచించారు.

ఎస్టీయూ సభ్యత్వ నమోదు

తెలకపల్లి: టెట్ నుంచి మినహాయింపు కోసం రివ్యూ పిటిషన్ వేయాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని ఆలేరు, గౌరెడ్డిపల్లి, బొప్పల్లి, మదనాపురం తదితర గ్రామాల్లోని ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులతో సభ్యత్వ నమోదు చేయించారు. 2010 కంటే ముందు నియమాకమైన ఉపాధ్యాయులను మినహాయించి విద్యాహక్కు చట్టం సరిచేయాలని కోరారు. ప్రతి ఒక్కరు ఎస్టీయూలో చేరాలని కోరారు. నాయకులు విశ్వేశ్వర్‌రెడ్డి, జహంగిర్‌పాషా, రఘురాంరెడ్డి, జిల్లా నాయకుల చెన్నయ్య, కృష్ణయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న పోలీసులు

అచ్చంపేట రూరల్: పట్టణంలో నిర్వహిస్తున్న బాల్య వివాహాన్ని మంగళవారం సీడబ్ల్యూసీ సభ్యుల ద్వారా అందుకున్న సమాచారం మేరకు పోలీసులు బాల్య వివాహాన్ని అడ్డుకున్నారు. అచ్చంపేట ఎస్‌ఐ–2 ఇందిర, షీ టీం బృందాలు పెళ్లి ఇంటికి వెళ్లి బాల్య వివాహం ద్వారా కలిగే నష్టాలను వివరించారు. బాలిక కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

మరమ్మతుకు నోచుకోని పల్లెరోడ్లు

- ఏళ్ల తరబడి అవస్థలు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



బురదమయంగా పెంట్లవెల్లి ప్రధాన రహదారి



కొండూరుకు వెళ్లే ప్రధాన రహదారిలో నిలిచిన వర్షపునీరు

పెంట్లవెల్లి: వర్షం వచ్చిందంటే చాలు ఆ రోడ్లపై ప్రయాణించాలంటేనే అటు ప్రజలు, ఇటు వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. రోడ్లపై మోకాళ్ల లోతు గుంతలు ఉండటంతో ఎప్పుడు వాహనం అదుపుతప్పి ఏ ప్రమాదం వస్తుందోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు పల్లె వాసులు. ఏళ్ల తరబడి మరమ్మతు చేయాలని అధికారులు, ప్రజా ప్రతినిధులను వేడుకుంటున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

మండల పరిధిలో..

ముఖ్యంగా మండలంలోని మంచాలకట్ట, మాధవస్వామినగర్, చొన్నకొండూరు గ్రామాల్లో రోడ్లపై ప్రయాణించాలంటేనే ప్రజలు జంకుతున్నారు. ఏళ్ల తరబడి గుంతల రోడ్లపై అవస్థలు పడుతున్నట్లు వాపోతున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పుడు అప్పుడు అని కాలాయాపన చేస్తున్నారు తప్పా ఫలితం కనీసం మరమ్మతు కూడా చేయడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

అదుపుతప్పుతున్న వాహనాలు

గ్రామాల్లోని గుంతల రోడ్లపై వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై ఏర్పడిన గుంతల్లో వర్షం నీరు నిలిచి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వర్షాకాలంలో సమస్య తీవ్రంగా ఉంది. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి నూతన రోడ్డు వేయాలని, కనీసం మరమ్మతులైనా చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు నిండా గుంతలే



పెంట్లవెల్లి– మంచాలకట్ట రోడ్డుపై మోకాలి లోతు గుంతలు ఉన్నాయి. వర్షాకాలంలో ప్రయాణించాలంటే భయంగా ఉంది. ఏళ్ల తరబడి ఇదే సమస్య వేధిస్తోంది. అధికారులు స్పందించి నూతన రోడ్డు వేయాలి.

– హుస్సేన్, మంచాలకట్ట

ఇబ్బందులు పడుతున్నాం



మాధవస్వామినగర్ నుంచి పెంట్లవెల్లికి చేరుకోవాలంటేనే ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. గుంతలమయమైన రోడ్లతో నానా అవస్థలు పడుతున్నాం. వర్షాకాలంలో తీవ్రత అధికంగా ఉంటుంది. ఎన్నోమార్లు అర్జీలు ఇచ్చిన అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదు.

– కుర్వ హుస్సేన్, మాధవస్వామినగర్

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి



వాల్మీకి మహర్షి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను మంగళవారం నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జిల్లా పోలీసు కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెంట్లవెల్లి, తిమ్మాజిపేట, కొల్లాపూర్ మండలం కుడికిల్లలో వాల్మీకి చిత్రపటాన్ని ఊరేగించి భారీ ర్యాలీ చేశారు. పెద్దకొత్తపల్లిలో యజ్ఞ యాగాలు నిర్వహించి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. అదేవిధంగా అచ్చంపేట, ఊర్కొండ, లింగాల, కోడేరు, దోమల పెంటలో వాల్మీకి చిత్రపటానికి పూజలు చేశారు. వాల్మీకి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



అచ్చంపేటలో పూజలు చేస్తున్న నాయకులు



కోడేరు మండలం జనుంపల్లిలో..

రోడ్లు జలమయం



కోడేరు: మండల కేంద్రంలో మధ్యాహ్నం కురిసిన వర్షానికి రోడ్లు జలమయం అయ్యాయి. భారీ వర్షం కురువడంతో పలు కాలనీలలో వర్షం నీరు నిలిచింది. గతంలో సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని అధికారులకు విన్నవించినా లాభం లేకుండా పోయిందని పలు కాలనీవాసులు వాపోయారు. ప్రతియేటా వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

పనులకు పిల్లలను తీసుకెళ్తే చర్యలు



లింగాల: పనులకు పిల్లలను తీసుకెళ్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ వెంకటేశ్వర్‌గౌడు హెచ్చరించారు. మంగళవారం మండలంలోని రాంపూర్ బస్ స్టేజీ దగ్గర ఎస్‌ఐతో పాటు విద్యాశాఖ, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, కోనేర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. మండలంలోని రాయవరం, లింగాల, అంబటిపల్లి, కోమటికుంట, సూరాపూర్, దత్తారం, శాయిన్‌పేట తదితర పాఠశాలలో చదివే విద్యార్థినులను తరలిస్తునట్లు గుర్తించారు. 20 మంది పిల్లలకు పనులకు వెళ్లకుండా అడ్డుకొని వారి స్వగ్రామాలకు పంపించారు. పిల్లలను పనులకు తీసుకెళ్లే వాహనాల యజమానులతో పాటు, పనులు చేయించుకునే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో హరిలాల్, సుదర్శన్, ఆంజనేయులు, జాకీర్ ఉస్సేన్, శ్రీనివాసులు, కానిస్టేబుల్ మాల్యానాయక్, శివశంకర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు జడ్జిపై దాడికి నిరసన



సాక్షి, నెట్‌వర్క్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడిని మంగళవారం జిల్లా వ్యాప్తంగా పలు కుల సంఘాల నాయకులు, న్యాయవాదులు ఖండించారు. కొల్లాపూర్‌లో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయవాదులు విధులు బహిష్కరించారు. కోర్టు గేట్‌ముందు వారు నిరసన వ్యక్తం చేశారు. అచ్చంపేటలో దాడికి యత్నించిన న్యాయవాది దిష్టిబొమ్మను దహనం చేశారు. పెంట్లవెల్లి, తాడూరు, మన్ననూరు, కోడేరు, అమ్రాబాద్‌లలో నిరసన తెలిపారు.



ఆశావర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలి

నాగర్‌కర్నూల్ రూరల్/కోడేరు: ఆశావర్కర్లకు ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పొదిల రామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నాగర్‌కర్నూల్ మండలంలోని పెద్దముద్దునురు, కోడేరు మండల కేంద్రంలో ఆశకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కనీస వేతన చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు దశరథం, లక్ష్మీగౌరమ్మ, పద్మ, శ్రీశైలం, మాణిక్యమ్మ, వరలక్ష్మి, కృష్ణవేణి, సులోచన, నర్మద, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: ఆశవర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దశరథం డిమాండ్ చేశారు. మంగళవారం వెన్నచెర్లలో ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీ మేరకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలైన ఆశవర్కర్లకు వేతనాలు పెంచడంలో నిర్లక్ష్యం వహించడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ల యూనియన్ నాయకురాలు అన్నపూర్ణ, శారద, సంతోషి,వనిత, రోజా, లలిత, వేణమ్మలు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

అచ్చంపేట రూరల్: ప్రభుత్వ నిబంధనలను పాటించని ఎరువుల దుకాణాదారులపై చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి కృష్ణయ్య హెచ్చరించారు. అధిక ధరలకు యూరియా అమ్మిన పట్టణంలోని అయ్యప్ప ట్రేడర్స్ గోదాంను మంగళవారం వ్యవసాయాధికారులు సీజ్ చేశారు. ఇటీవల ఓ రైతుకు అధిక ధరలకు యూరియా అమ్మినట్లు ఆధారాలు ఉండటంతో సంబంధిత వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేశాడు. విచారణ అనంతరం తుది నివేదికను ఎరువుల లైసెన్సింగ్ అథారిటీకి సమర్పించారు. నివేదిక ఆధారంగా ఎరువుల లైసెన్సింగ్ అథారిటీ అయిన వ్యవసాయ సహాయ సంచాలకుడు చంద్రశేఖర్ సంబంధిత డీలర్‌పై తదుపరి ఆదేశాలు వచ్చే వరకు లైసెన్స్ రద్దు ఆర్డర్ జారీ చేశారు. అలాగే వ్యవసాయాధికారులు షాపును పరిశీలించి, గోదాంలో ఉన్న మొత్తం ఎరువుల నిల్వలను సీజ్ చేశారు. రైతులకు అధిక ధరలకు యూరియా అమ్మినా, అక్రమ బిల్లులు సృష్టించినా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

తాగునీటి కోసం రాస్తారోకో



రాస్తారోకో నిర్వహిస్తున్న ప్రశాంతి నగర్ కాలనీవాసులు

మన్ననూర్: ప్రశాంతి నగర్ (మన్ననూర్)లో 10 రోజులు తాగునీరు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నా అధికారులు ఎవరు పట్టించుకోవడం లేదని గ్రామంలోని మహిళలు ఖాళీ బిందెలతో రాస్తారోకో నిర్వహించారు. శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారి మన్ననూర్ అంబేడ్కర్ కూడలికి వస్తున్న క్రమంలో మసీద్ వద్ద పోలీసులు వారిని అడ్డుకోవడంతో అక్కడే రోడ్డుపై కూర్చున్నారు. గ్రామంలోని మహిళలు, యువకులు తాగునీటి గోస గురించి అధికారులకు తెలియజేయడం కోసమే ఆందోళన చేస్తున్నాం కొంత సమయం ఇవ్వాలని పోలీసులను వేడుకున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎలాంటి ఆందోళనలకు అవకాశం లేదని వివరించారు. కొంత కాలంగా గతుకుల రహదారితో (రోడ్డు) రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ స్పందించి గ్రామంలో కనీస సమస్యలు పరిష్కరించాలని కోరారు.

చదువుతో పాటు క్రీడలు అవసరం



విద్యార్థులను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్లు దేవసహాయం, అమరేందర్

నాగర్‌కర్నూల్/నాగర్‌కర్నూల్ క్రైం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను చదువుతో పాటు క్రీడల్లో నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని అదనపు కలెక్టర్లు దేవ సహాయం, అమరేందర్ అన్నారు. జిల్లా నుంచి క్రీడా పాఠశాలలకు ఎంపికైన 8మంది విద్యార్థులను మంగళవారం కలెక్టరేట్‌లో శాలువాలతో సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడల్లో రాణించే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. క్రీడల్లో నైపుణ్యం పెంపొందించుకొని రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించాలని సూచించారు.

■ జిల్లాలో క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించడంలో, పోషకాహార కిట్లు అందించడంలో ముఖ్యపాత్ర వహిస్తున్న భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని అదనపు కలెక్టర్ అమరేందర్ అన్నారు. సంస్థ కార్యక్రమాలను పర్యవేక్షించడానికి ముంబై నుంచి వచ్చిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ట్రస్టు ప్రతినిధి అక్షేష మిశ్రా అదనపు కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటుచేసిన మొబైల్ ఎక్స్‌రే యంత్రంతో క్షయ అనుమానితులను గుర్తించడంతో పాటు ప్రతి నెలా పోషకాహార కిట్లు అందిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల జిల్లా జనరల్ ఆస్పత్రిలో సీబీ నాట్ యంత్రాన్ని కూడా ఏర్పాటు చేశారన్నారు. అనంతరం ఆమెకు అదనపు కలెక్టర్ జ్ఞాపికను అందజేసి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. క్షయ నియంత్రణ అధికారి రాజశేఖర్, డీపీఓ రేణయ్య, ఏపీఓ మిన్హాజ్, భవిష్య భారత్ రాష్ట్ర డిప్యూటీ మేనేజర్ హనుమాన్, జిల్లా మేనేజర్ సజ్జత్ అలీ, సాయికుమార్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం



అమ్రాబాద్: ప్రతిరోజు పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ అదనపు సీడీపీఓ కమల అన్నారు. రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని జంగంరెడ్డిపల్లిలో చెంచు మహిళలకు పోషకాహారంపై శిక్షణా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమల మాట్లాడుతూ చెంచు మహిళలు ఎక్కువగా సరాల బలహీనత, రక్తహీనతతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. ఆకుకూరలు, పాలు, గుడ్లు, పండ్లు తీసుకుంటే పోషకాహారలోపాన్ని అధికమించొచ్చని తెలిపారు. రాంకీ ఫౌండేషన్ మేనేజర్లు చంద్రశేఖర్, జాల మల్లేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజారాం తదితరులు ఉన్నారు.

మంత్రి పొన్నం క్షమాపణ చెప్పాలి



అచ్చంపేట రూరల్: ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన అవమానకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మహేష్ అన్నారు. మంగళవారం పట్టణంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. దళిత మంత్రిపై వ్యాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు. వ్యక్తిగత దూషణ కాదని దళిత వర్గాల, మాదిగ సమాజం ఆత్మగౌరవంపై దాడిగా భావిస్తున్నామన్నారు. పొన్నం ప్రభాకర్ వెంటనే తమ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు భరత్, రమేష్, రాజు, సంపత్, ఐశ్వర్య, నందిని శృతి పాల్గొన్నారు.

ఉచితంగా వేరుశనగ విత్తనాల పంపిణీ



ఉప్పునుంతల: మండలంలోని పీఏసీఎస్‌లో మంగళవారం వేరుశనగ విత్తనాల పంపిణీని మండల వ్యవసాయధికారి రమేష్ , పీఏసీఎస్ సీఈఓ రవీందర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పీఓ)లో సభ్యులుగా ఉన్న రైతులకు ప్రస్తుత యాసంగిలో సాగుచేసుకోవడానికి ఎన్‌ఎంఈఓ (నేషనల్ మిషన్ ఆన్ ఇడిబుల్ ఆయిల్ సీడ్స్) పథకం ద్వారా వేరుశనగ విత్తనాలు అందజేస్తునట్లు పేర్కొన్నారు. దేశంలో నూనెగింజల ఉత్పత్తిని గణనీయంగా పెంచడానికి రైతులను ప్రోత్సహించే క్రమంలో ప్రభుత్వం పథకం ద్వార ఒక్కో రైతుకు 90 కేజీల విత్తనాలను ఉచితంగా అందిస్తామన్నారు. మండలానికి మొత్తం 955 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. కదిరి లేపాక్షి, జీజేజీ మేలురకం విత్తనాలు ఉన్నట్లు తెలిపారు. ఎఫ్‌పీఓ (ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్)లో సభ్యులుగా ఉన్న 1250 మంది రైతులకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ మంజుల, ఎఫ్‌పీఓ సంఘ సభ్యులు, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీపురం విద్యార్థికి గోల్డ్‌మెడల్



కందనూలు: నాగర్‌కర్నూల్ మండలంలోని శ్రీపురం గ్రామానికి చెందిన విద్యార్థి నరేష్‌కు హైదరాబాద్‌లోని కేంద్రీయ విశ్వవిద్యాలయంలో పీజీ ప్రాచీన తెలుగు సాహిత్య విభాగంలో గోల్డ్ మెడల్ సాధించాడు. విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ బీజే రావు నుంచి మంగళవారం గోల్డ్‌మోడల్ అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి నరేష్‌కు విశ్వవిద్యాలయ అధ్యాపకులు, విద్యార్థులు, మిత్రులు, అభినందనలు తెలిపారు.

'కులం పేరుతో దూషించడం సరికాదు'



తెలకపల్లి: నవరాత్రి ఉత్సవాలలో భాగంగా దుర్గా మాతకు పూజలు చేసేందుకు వెళ్లిన మాల కులస్తులను కొందరు కులం పేరుతో దూషించడం సరికాదని జాతీయ మాల మహానాడు అధ్యక్షుడు చెన్నయ్య పేర్కొన్నారు. మండలంలోని జంగమోనిపల్లి గ్రామాన్ని ఆయన సందర్శించారు. దళితవాడలో గ్రామంలో పర్యటించారు. బాధితులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చుసుకోవాలని గ్రామ పెద్దలకు సూచించారు. ఆయన వెంట నాయకులు రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఎన్నుపోతుల అనిల్, మల్లికార్జున్, పాండు, రాజు, సుధాకర్‌బాబు, మనోహర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇద్దరు బైండోవర్

ఊర్కొండ: స్థానిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని మాదారం గ్రామానికి చెందిన శేరిబాబా, బొమ్మరాజు పల్లి గ్రామానికి చెందిన చలమల శ్రీశైలం గౌడ్ లను మంగళవారం బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ కృష్ణదేవ తెలిపారు. తహసీల్దార్ యూసుఫ్ అలీ ఎదుట హాజరుపరిచినట్లు వివరించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతం



నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లా కేంద్రంలోని సీతారామస్వామి దేవాలయంలో అశ్వయుజ మాస పౌర్ణమి సందర్భంగా మంగళవారం రమా సహిత సత్యనారాయణస్వామి సామూహిక వ్రతాలు నిర్వహించారు. పలువురు దంపతులు వ్రతాన్ని ఆచరించారు. రామాలయం ప్రధాన అర్చకులు కందాడై వరదరాజన్‌అయ్యంగార్, కందడై జయలక్ష్మి, శ్రీనివాస చార్యులు, కరుణశ్రీ, అర్థం రవీందర్, మల్లేష్, నందకిషోర్, మహిళలు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం

వెల్దండ: స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకొని సత్తాచాటుదామని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో జెడ్పీటీసీ స్థానంతో పాటు 11 ఎంపీటీసీ స్థానాల్లో పార్టీ అభ్యర్థులను బరిలో ఉంచాలన్నారు. కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ శేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు యాదగిరి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, కండె హరిప్రసాద్, బండెల రామచంద్రారెడ్డి, బాలస్వామి, రవికుమార్, పెద్దయ్యగౌడు, పరమేష్‌గౌడు, జగదీశ్వర్, దేవేందర్ తదితరులు ఉన్నారు.

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సింగోటంలో బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బీజేపీ జిల్లా నాయకులు సాయి కృష్ణ గౌడ్ హాజరై మాట్లాడారు. మహిళలకు, నిరుద్యోగులకు, రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసాలను వివరించాలని సూచించారు. గ్రామ, మండల నాయకులు పాల్గొన్నారు.